# బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి



కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు తూంకుంట అరుణ్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేస్తున్న కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ



నాంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ గౌడ్‌తో లక్ష్మీనారాయణ, ప్రియాంక గౌడ్, సంజయ్, ప్రదీప్‌కుమార్ అగర్వాల్

మెహిదీపట్నం, నవంబర్ 13 : ప్రతి కుటుంబంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలలో ఏదో ఒక పథకం లబ్ధిదారుడు ఉన్నాడని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని నాంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు సి.సంజయ్, అబ్దుల్ కలీం, మెట్టు నట్‌రాజ్, లక్ష్మీనారాయణ, ప్రదీప్‌కుమార్ అగర్వాల్, ప్రియాంక గౌడ్, యూసుఫ్, ఇక్బాల్, నరేందర్ బిల్లం, దయానంద్, చింతల అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.

### లంగర్‌హౌస్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణను గెలిపించాలంటూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎన్.చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి కృష్ణదాస్, నాయకులు భాను, సాయికిరణ్ పాల్గొన్నారు.

కార్వాన్, నవంబర్ 13 : పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఆ పార్టీ కార్వాన్ అభ్యర్థి మిత్ర కృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ నాయకులు తూంకుంట అరుణ్‌కుమార్‌తో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్ష పార్టీల పార్టీలు ఓర్వలేక పోతున్నాయని, ఆ పార్టీలు ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రజలు మాత్రం మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు సంసిద్ధులై ఉన్నారని తెలిపారు. ప్రజల సహకారంతో కార్వాన్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణకు సంపూర్ణ మద్దతు లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంతో భాగంగా కరపత్రం అందజేస్తున్న నాంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ గౌడ్



కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణను గెలిపించాలంటూ బీఆర్ఎస్ నాయకులు

## బరిలో నిలిచే పార్టీల అభ్యర్థులు వీరే

చార్మినార్, నవంబర్ 13 : నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్క్రూట్నీని సోమవారం పరిశీలించారు. చార్మినార్, బహదూర్‌పుర నియోజకవర్గాల్లో స్క్రూట్నీ పూర్తి చేసిన అధికారులు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలు వెల్లడించారు. బహదూర్‌పుర లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి ఇనాయత్‌అలీ భాక్రీ, ఎంఐఎం నుంచి మొబిన్, కాంగ్రెస్ నుంచి పులిపాటి రాజేశ్‌కుమార్, బీజేపీ నుంచి వై.నరేశ్‌తో సహా మరో 8 మంది అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. మరో నాలుగు నామినేషన్లను సాంకేతిక కారణాలతో తిరస్కరించామని బహదూర్‌పుర రిటర్నింగ్ అధికారి దశరథ్‌సింగ్ తెలిపారు. చార్మినార్ నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలతో సహా మరో 10 మంది అభ్యర్థులు ఎన్నికల్లో తమ భవితవ్యాన్ని పరిశీలించుకోనున్నారు. స్వ తంత్ర్య అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేసిన 8 మందికి సంబంధించిన నామినేషన్ల సాంకేతిక కారణాలతో తిరస్కరించినట్లు చార్మినార్ రిటర్నింగ్ అధికారి వెంకన్న తెలిపారు.



## ఘనంగా సదర్ ..



దీపావళి పండుగను పురస్కరించుకొని గోడకిఖబర్‌లో సదర్ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం దీపావళి పండుగ మరుసటి రోజు యాదవుల దున్నలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది బస్తీల్లో ప్రధాన ప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో దున్నల ప్రదర్శన నిర్వహించారు. యువకులు దున్నల పైకి ఎక్కి నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. గోడేకిఖబర్, మల్లేపల్లి, బజార్‌ఘాట్, గౌలిగూడ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో సదరు ఉత్సవాలను నిర్వహించారు. **- అబిడ్స్, నవంబర్ 13**

## కార్వాన్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం



నానల్ నగర్, టోలిచౌకి, గోల్కొండ డివిజన్లలో సోమవారం ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి కౌసర్ మొహినుద్దీన్ ప్రచారం నిర్వహించారు. కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను చేశామని, మరో సారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ప్రచారంలో నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు మహ్మద్ హరూన్ ఫర్హాన్, వజీ ఉజ్జమాసిద్దిఖీ, మహ్మద్ అలీం, మహ్మద్ హకీం, సునంద, శారద, విజయ్, జహంగీర్, షకీల్ పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, నవంబర్ 13**

## ప్రమాద బాధితులకు అండగా ఉంటాం





నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్ బజార్‌ఘాట్‌లో సోమవారం జరిగిన ప్రమాద బాధితులను ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ మాజీద్ హుస్సేన్ పరామర్శించారు. అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మాజీద్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి మాజీద్ హుస్సేన్ మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు.

● నాంపల్లి బజార్‌ఘాట్‌లో అగ్నిప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు నాంపల్లి ఎమ్మెల్యే, యాకుత్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మెరాజ్ ఉస్మానియా మార్చురీ వద్ద పరామర్శించి సానుభూతిని తెలిపారు. **- మెహిదీపట్నం, నవంబర్ 13**

## పేద కుటుంబాలకు సేవ చేయడానికి..



రవీంద్రభారతి, నవంబర్ 13 : పేద రోగుల కుటుంబాలకు సేవ చేయడానికి వన్ హార్ట్ ఫౌండేషన్ ఇండియా ముందుకు వచ్చింది. ఫౌండేషన్ అధ్యక్షుడు మహేశ్ మంద ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తన స్నేహితులతో కలసి సేవ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. దీపావళి సందర్భంగా నిలోఫర్‌లోని రోగుల కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారి పరిస్థితిని చూసి స్పందించి నెలకోసారైనా ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు అందరూ ముందుకు వచ్చారని మహేశ్ అన్నారు.

